# గ్లోబల్ నగరం

## యెన్నం ఉపేందర్

కథ



**అమ్మను చూడాలనిపించిందే తడవుగా హైదరాబాదుకు బయల్దేరాను, ముస్సోరి నుంచి. ఢిల్లీకి చేరేసరికి ఉదయం రెండు గంటలైంది. ఆపై డొమెస్టిక్ ఎయిర్‌పోర్టుకు చేరేసరికి మరోగంట గడిచింది. సాధారణంగా రైలు ప్రయాణాలే చేస్తుంటాను. శని, ఆదివారాలు పోనూ, ఇంకో రోజు మాత్రమే సెలవు దొరికింది. అందుకే ఫ్లైటుకు రావాలనుకున్నాను.**

ఫ్లైటు ప్రయాణం ఓ అద్భుతమైన అనుభవం. భూమిపై నిల్చున్నప్పుడు 'తలయెత్తి' చూస్తేనే గాని కనిపించని కట్టడాలు, ఫ్లైటు విండో నుంచి 'పిడికెడు' పరిమాణంలో కనిపించడం ఓ వింత. చూసే చూపులో ఉండేనో లేక మరేదో సాంకేతిక శాస్త్రీయ కోణం ఉండేనో! బ్రేకు ఫాస్టు, చాక్లెట్లు ఈయడం అయిపోయింది. అందరు 'కూల్'గా సీట్లల్లో కూలబడి విశ్రాంతి తీసుకుంటున్నారు. వారు భూమిపై ఉన్నప్పుడు ఉన్న సైజులోనే ఉన్నారు. కిందికి చూసాను. గోదావరి నదేమో!

వంకరటింకరగా కనిపిస్తూ, కనుమరుగైంది. 'మనిషి దృక్కోణం బట్టే గదా ఏదైనా' నాలోని ఇన్‌సైడర్ సహూధానపడ్డాడు. చూస్తుండగానే భాగ్యనగరం వచ్చింది. వృత్తి ధర్మంలో భాగంగా చిరునవ్వు ముఖంతో నమస్కరిస్తున్న ఎయిర్ హోస్టస్‌కు 'థ్యాంక్సు' చెబుతూ ఫ్లైటు దిగాను. ఆమెకు 'థ్యాంక్సు' చెబుతున్నప్పుడు విన్నవారు నావైపు అదోలా చూసారు. 'థ్యాంక్సు' చెప్పకబోడం వారి సంస్కారమో! ఎంతసేపటికి మనం గిరిగీసుకున్న గీత నుంచి బయటకొచ్చి ఆలోచించలేమా! సంస్కారం అంటే మర్యాద యిచ్చి పుచ్చుకోడం కాదా?

ఎవరెవరి కోసమో సైనుబోర్డులు పట్టుకుని ఎదురుచూస్తున్న వ్యక్తుల్ని తప్పించుకుంటూ వెళ్తున్న నన్ను, నాలోని ఇన్‌సైడర్ సర్‌కాస్టిక్‌గా ప్రశ్నించాడు.

"నీకోసం వచ్చేవారు ఎవరు లేరు కదా" నొచ్చుకున్నాను నేను. సమాధానం వెనువెంటనే యిచ్చుకోక, ఆటోకోసం 'అటు' 'ఇటు' చూసాను.

"కహాఁ జానాహై సాబ్" వెనకనుంచి ఆటోవాడి ప్రశ్న.

"అశోక్‌నగర్" జవాబిచ్చాను.

నాలోని ఇన్‌సైడర్ చైతన్యీకృతమై ముసిముసిగా నవ్వసాగాడు. నవ్వి,

"చూసావా! తెలుగు గడ్డపై, రాష్ట్ర రాజధానిలో హిందీ భాషా ప్రభావం! 'తెలుగు' 'తెలుగు' అని అఘోరిస్తావే. హిందీలో అడగ్గానే వెంటనే సమాధానం యిచ్చావ్" ప్రశ్నించాడు.

అంతరంగం వేసిన ప్రశ్నకు కాస్త సిగ్గుగా అనిపించింది. రాష్ట్రానికి దూరంగా, సాధారణ ప్రజానీకానికి దూరంగా ఉద్యోగం చేస్తున్న నాకు, తల్లి భాషన్నా, తల్లి నేలన్నా ప్రాణం.

ఆటో అతను ఇంకా అడిగాడు.

"ఆప్ హైద్రాబాద్‌కో పహలీబార్ ఆయా? యా..." అతని మాటల్ని మధ్యలోనే త్రుంచదలచి,

"నీకు తెలుగు రాదా" ప్రశ్నించాను. అనుకోని ఆ ప్రశ్నకు,

"ఎందుకు రాద్సార్. గట్లంటరు. తెలుగోణ్ణే కదా నేను" అన్నాడు. దానికి నేను,

"అలాంటప్పుడు నువ్వు చక్కగా తెలుగులో మాట్లాడొచ్చుకదా" తెలివిగా ప్రశ్నించాననుకొన్నాను.

రిక్షాతను కాస్త వెనక్కి తలతిప్పి, అదోలా చూసి,

"ఆప్ కాఫీ పురానాహై సాబ్. సిటీలో ఉర్దూ ప్రభావం యిప్పుడొచ్చిందా సార్. మీకు తెల్వందేముంది. ఆప్ చార్మినార్‌కో దేఖా" ప్రశ్నించాడు అతను.

ప్రశ్నకు నేరుగా జవాబీయక పక్కదారి పట్టిస్తున్నాడేమోననిపించి,

"నేనడిగిందానికి జవాబేమీ ఈయలేదు" ఆక్షేపించాను.

"ఏమోసార్. నేనెప్పుడు గూడా ఈ తీర్గ సోచాయించలే. అయినాకాని సారు, హిందీల్నో, ఉర్దూల్నో మాట్లాడితే తప్పేంటి" రివర్సులో వచ్చాడతను.

"అహఁ. అలా అనికాదు. తప్పొప్పుల సమస్యకాదిది. ఆత్మగౌరవ సమస్యిది. తెలుగు మన తల్లిభాష. మన తల్లిభాషను వదలిపెట్టి, వేరే ఏ యితర భాషల్నో ఎందుకు మాట్లాడాలి? మన భాషను మనం గౌరవించుకోవాలి కదా" తెలివిగా ఉపన్యసించాననుకున్నాను.

దానికి ఆటో అతను సబ్‌మిట్ అయి, "ఏమో సారు. మీ మాటలు కొత్తంగున్నై. మనోళ్ళు తెలుగు మాట్లాడకుండా, ఉర్దెట్ల, ఇంగిలీసెట్ల మాట్లాడ్తండ్రో సమజ్ గాట్లేదు" అన్నాడు.

మొత్తానికి నా శ్రమ కొద్దిగా ఫలించిందని లోలోన సంతోషపడ్తూ,

"నీ పిల్లలేం జేస్తున్నారు" అడిగాను.

పోరి నాల్గు సదువుతంది. పోరడు ఏడు సదువుతండు"

"ఇంగ్లీషు మీడియమా, తెలుగు మీడియమా" మెల్లగా మరో చర్చకు తెరదీసాను.

"ఇంగిలీసు మీడియమే" సాలోచనగా అన్నాడు. తిరిగి కంటిన్యూ చేస్తూ,

"ఏం జేయమంటరు సారు. హర్ మయినే వెయ్యి రూపాయలకు పైన్నే కర్సైతంది. కాన్వెంటు సదువు సెప్పిత్తన్న" అన్నాడు రిక్షా స్లో చేస్తూ.

"గవర్నమెంటు స్కూల్లో చేర్పించకపోయావా" కాజువల్‌గా అడిగాను. వినకూడనిది విన్నట్లు, నావైపు ఓమారు చూసి,

"గవుర్మెంటు బల్లె సదువుజెప్తరా సారు! పోరగాళ్ళు అండ్ల సదువుతే ఎందుకు గొరగాకుండా అయిపోతరు. పంతుల్లు పాఠాలు జెప్పటానికి వత్తరా ఏంటి?! ఎంతసేపట్కి నెలెప్పుడు అయిపోయిద్దా జీతం ఎప్పుడు సేతుల బడ్తదా అని సూసుడే నాయె. ఈ మజ్జల ఉజ్జోగానికెక్కిన సార్లు పడుసోళ్ళు. ఎప్పుడు సూసినా హీరో హోండా కొందామా, మార్కెట్ల కొత్తమోడల్ ఏమొచ్చింది, డి.ఎ. ఎప్పుడు పెంచుతరు... అని సోచాయించుడేనాయె."

నేను ఆలోచించసాగాను. నాలోని ఇన్‌సైడర్,

"చూసావా! నువ్వేదో నీతిపాఠాలు చెబుతామనుకున్నావు. దొరికిపోయావు. యిప్పుడేమంటావు?" హేళనగా మాట్లాడాడు.

వస్తున్న కోపాన్ని నిగ్రహించుకుంటూ గతాన్ని గుర్తుకు తెచ్చుకోసాగాను.

"ఆ రోజుల్లో... చాలా సంవత్సరాల క్రితం, నేనెలా వెళ్ళేది బడికి? ఉదయం మొదటి గంట కొట్టకముందే పలకా బలపం పట్టుకొని తరగతి గదిలోకి వెళ్ళేవాణ్ణి. ఓవైపు కుండపోతగా వర్షం కురుస్తున్నా, కురిసే యింటికప్పును పట్టించుకోకుండా, ఒత్తిగిలి తదేకంగా చదువుపై ధ్యాస పెట్టేవాణ్ణిగదా! ఆ రోజుల్లో సార్లు పిల్లల సదువుపట్ల ఎంత శ్రద్ధ పెట్టేవారు. బడికి ఒక్కరోజు వెళ్ళకపోతే, సార్లు స్వయాన యింటికొచ్చి బడికెందుకు రాలేదో వాకబు చేసేవారు గదా! హైస్కూలు విద్యకోసం పదహారు కిలోమీటర్లు నడచివెళ్ళే వాళ్ళం. ఏమైనా తప్పుచేస్తే సార్లు బెత్తంతో వాతలొచ్చేట్లు కొట్టేవారు. యిప్పుడేమైంది? బడిలో సారు మందలిస్తే చాలు. తల్లిదండ్రులు వారి తాలుకు బంధువులు స్కూలుపై దాడిచేసి సార్లను నానా దుర్భాషలాడుతున్నారు. పిలగాండ్లకు చదువు వచ్చినా రాకపోయినా ఫర్వాలేదుగాని కొట్టొద్దంటున్నారు. కాలం ఎంతగా మారింది" ఇన్‌సైడర్ నా ఆలోచనా స్రవంతికి అడ్డుదగిలాడు.

"పెసర చేను దుయ్యటానికి బళ్ళోని పిల్లలందర్నీ హెడ్‌మాస్టరు తీసుకెళ్ళటం మరచావా? లెక్కల మాస్టారు కొడుకు ఏడవ తరగతిలో, హెడ్మాస్టరు కుమార్తె పదవ తరగతిలో ఫస్టు రావాలని నకలు చిట్టీలు సార్లే అందించటం మరచిపోయావా" ప్రశ్నించాడు తాపీగా.

> "అహా౦. అలా అనికాదు.
> తప్పొప్పుల సమస్యకాదిది. ఆత్మగౌరవ సమస్యిది. తెలుగు మన తల్లిభాష. మన తల్లిభాషను వదలిపెట్టి, వేరే ఏ యితర భాషల్నో ఎందుకు మాట్లాడాలి? మన భాషను మనం గౌరవించుకోవాలి కదా" తెలివిగా ఉపన్యసించాననుకున్నాను.
> దానికి ఆటో అతను సబ్‌మిట్ అయి,
> "ఏమో సారు. మీ మాటలు కొత్తంగున్నై. మనోళ్ళు తెలుగు మాట్లాడకుండా, ఉర్దెట్ల, ఇంగిలీసెట్ల మాట్లాడ్తండ్రో సమజ్ గాట్లేదు" అన్నాడు.

"ఆం. అవుననుకో. చదువును మేము నిర్ల క్ష్యం చేయలేదుగదా. యిప్పుడు ప్రభుత్వ స్కూళ్ళంటేనే చిన్నచూపొచ్చే" మనసు బాధపడింది.


నే రావాల్సిన చోటు రాగానే ఆటోవాడిని ఆపి, డబ్బిచ్చి, బంధువుల ఇంటికి బయల్దేరాను. ఒకప్పుడు ఆ ప్రదేశమంతా ఖాళీగా ఉండేది. యిప్పుడు అపార్టుమెంటుల్తో నిండిపోయింది. గ్రౌండు ఫ్లోర్‌లో నేవెళ్ళాల్సిన యింటి అడ్రసు చూసుకొని లిఫ్టులో వెళ్ళాను.

వెళ్ళేసరికి యింట్లోని పెద్దవారంతా టి.వి.ముందు కూర్చొని తదేకంగా ఏదో సీరియల్ చూస్తున్నారు. నన్నోమారు చూసి, మరలా టి.వి చూడటంలో మునిగిపోయారు.

చెప్పులు బయటే వదిలేసి నేను 'ఫలానా' అని చెప్పాను. అది విన్న ఆ పెద్దాయన 'తెలుసులేవోయ్' అన్నట్లు నవ్వి 'కూర్చో' అని సైగచేసి మరలా టి.వి చూడటంలో మునిగిపోయాడు.

వాళ్ళు సీరియల్ మైకంలో ఉన్నారనుకొని, ఇల్లంతా చూపుల్తో సర్వే చేయసాగాను. పక్కనున్న రూంలో వారి మనవడనుకుంటా కంప్యూటర్‌లో గేమ్సు ఆడుతున్నాడు. యింతలో సీరియల్ అయిపోయిందేమో! ఆ యింటి పెద్దాయన,

"ఆ పిల్లగాడు మా మనవడే. మంచి పేరున్న కాన్వెంట్‌లో చదువుతున్నాడు. వాడు ఆల్‌రౌండరు. ఏం స్కూలు! ఏం స్కూలు! ఎన్ని టెస్టులో. మొన్ననే ఎక్స్‌కర్షన్‌కి మలేసియా వెళ్ళొచ్చాడు. ప్రతీనెలా ఓ రెండువేల ఖర్చయితన్నయనుకో...." చెబుతున్నాడు.



నాలోని ఇన్‌సైడర్ ఆక్టివేటయ్యాడు. "నీ బడి చదువుకు ఎంతైందిరా? బడిలో ఫీజులు కట్టడానికి అమ్మ కుట్టిన విస్తర్లు అమ్మగా వచ్చిన పైసలు సరిపాయే. ఇంటర్మీడియేట్ అంతా నువ్వు పశువులు మేపుకుంటూనో, పొలానికి నీళ్ళు పట్టిస్తూనో, ఓపెన్ యూనివర్సిటి త్రైపులో కంప్లీట్ చేసావు. ఇంజనీరింగులో సీటుకోసం కట్టాల్సిన ఐదొందల పదహార్లకు అమ్మ కాళ్ళ గొలుసులు ఎగిరిపాయే. ఎన్నడైనా నువ్వు పుస్తకాలు కొని చదివావా?"

"మా అబ్బాయి కోడలు అమెరికాలో ఉంటున్నారు. నీకు తెలుసుకదా. ఈ మనవణ్ణి రేప్పొద్దున ఐ.ఐ.టి. చేయించి వీడ్ని కూడా అమెరికా పంపిస్తా"

విశ్వాసంగా చెబుతున్న ఆయన మాటలు వింటూ, ఆయనగారి స్వప్నాల జాడెంట నేను వెళ్ళే సాహసం చేయక, పగలబడి నవ్వుతున్న అంతరంగాన్ని ఆపలేక, నిశ్చేతనంగా ఉండిపోయాను. కొద్దిసేపటి తర్వాత, ఆ కృత్రిమ వాతావరణంలో ఇమడలేనని అనిపించి, కాసిన్ని మంచినీళ్ళడిగి సిటీ సర్వేకు బయల్దేరాను.

హైదరాబాదు చాలామారింది. ఎక్కడ చూసినా ఫ్లైవోవర్లు, ఇంటర్నెట్ కఫేలు, పచ్చదనం...

సిటీ బస్సుల్లో ఊపిరి మెసలని ఆ రద్దీలో కూడా, కంప్యూటర్ పుస్తకాలేవో తెరచి చూస్తున్న యువత. జావా, యస్.క్యూ.యల్., వి.బి.... యింకేదో టైటిల్లతో పుస్తకాల అట్టలు మెరిసిపోతున్నాయి. నాకు చాలా సంతోషం అయింది. "ఆహా౦! మనిషి జీవితంలో ఎంత స్పీడొచ్చిందో" అనుకుంటుంటే పగలబడి నవ్వుతున్న శబ్దమొకటి వినిపించింది. 'ఎవరిదా నవ్వని' 'అటు' 'ఇటు' చూసాను. ఎవరి బిజీలో వారున్నారు. పక్క సీట్లోని యువకుడు తాను త్వరలో యు.యస్.కి వెళ్తున్నానని, తాను వెళ్ళిన తర్వాత 'నువ్వు కూడా త్వరలో వచ్చేద్దువని' అతని గర్ల్‌ఫ్రెండుతో కాబోలు, వాగ్దానాలు చేస్తున్నాడు. వెనకసీట్లో ఏడవతరగతి చదువుతున్న కుర్రాడు తన కళ్ళజోడు పదేపదే సర్దుకుంటూ సైన్సు పాఠ్యపుస్తకం చదువుతున్నాడు. ఫుట్‌బోర్డుపై నిలబడ్డ జీన్సు వేసుకున్న యువకుడు 'సెల్'లో మాట్లాడుతున్నాడు. మరోసారి వినపడిన నవ్వును గుర్తెరిగి, 'ఇది ఇన్‌సైడర్ పనేనని' చిరాకు ప్రదర్శిస్తూ, టాంకుబండ్‌పై బస్సు దిగాను.

సిటీ అంతా జన్మభూమి, పచ్చదనం- పరిశుభ్రత కటౌట్లు. పక్కన హుస్సేన్‌సాగర్ నిండా నీళ్ళు. యిటుపక్కన తెలుగు తేజాన్ని అజరామరం చేసిన దివ్య మూర్తుల విగ్రహాలు. సాగర్ మధ్యలో అందంగా బుద్ధుడి విగ్రహం.

"అహా౦. ఎంత మనోహరంగా ఉంది సిటీ. చాలామారింది. ప్రజలందరూ హాయిగా ఉన్నా... రనుకుంటూ..."


దూరంగా గుమికూడిన జనం. క్రేనుతో ఏదో లాగుతున్నారు. 'సాగర్‌లో క్రేను ఉపయోగించి తీసే వస్తువేముందీ?' మస్తిష్కం వేగంగా పనిచేయసాగింది.

"శ...వం..." శవాన్ని వెలికి తీస్తున్నారు. "అయ్యో! ఎవరు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో. ఆత్మహత్యే ఎందుకనుకోవాలి? హత్య కాకూడదా" ఆలోచనల పరంపర.

ముసిముసి నవ్వులు నవ్వుతున్న అంతరంగాన్ని పట్టించుకోకుండా ఆ గుంపు దగ్గరికి వెళ్ళాను. "అది హత్యేనట..." ఆడమనిషి... ముప్పైలోపే ఉంటుంది ఆమె వయసు. మనసు కలుక్కుమంది. అప్పటివరకు వెలుగుతున్న సూర్యుడు బుద్ధుడి వెనకాల దాక్కున్న దృశ్యం. ఇప్పుడు బుద్ధవిగ్రహం మసకమసగ్గా కనిపించసాగింది.

'అయ్యోపాపం' అనేవారు కొందరు, చూసీచూడనట్లు వెళ్ళేవారు కొందరు, యాంత్రికంగా నడుచుకుంటూ వెళ్ళేవారు మరికొందరు.

కొంత సమయం గడిచింది. గుంపు చెదిరిపోయింది. శవాన్ని పోస్టుమార్టం కోసం తీసుకెళ్ళారు. ట్రాఫిక్ యథాతథమైంది. ఇపుడు అక్కడ ఓ శవాన్ని వెలికితీసామంటే ఎవరు కూడా నమ్మరు. ఉన్నట్లుండి వడమర నుంచి వచ్చిన దుర్గంధం ముక్కు పుటాలకు సోకింది. ఛీ! ఛీ! అంటూ ఫుట్‌పాత్‌పై నడుస్తున్నవారు ముక్కు మూసుకున్నారు.



'మనుషుల వల్ల హుస్సేన్‌సాగర్ కలుషితం అయిందా లేక సాగర్ వల్ల మనుషులు కలుషితం అయ్యారా' ఇన్‌సైడర్ ప్రశ్న.

కాసేపు నిలబడి అస్తమించబోతున్న సూర్యుణ్ణి చూడసాగాను.

"రేపుదయం బిల్‌గేటు హైటెక్ సిటీకి వస్తుండట" పక్కనున్న ముసలాయన నాతో అన్నాడు. అతని కళ్ళల్లో డాలర్ రెపరెపలు.

"బహుశః అతని కొడుకు కంప్యూటర్ కోర్సేమైనా చేస్తున్నాడో!" అంతరంగం ఆరా తీసింది.

"అయ్యా! ధర్మం చేయండి బాబూ! చేసిన ధర్మం ఊరకేపోదూ" ఓ ముసలి తల్లి దీనాలాపన వినబడి పక్కకి తిరిగి చూసాను. ఆమె మనవడేమో! ఓ పిలగాడు ఆమె చేయి పట్టుకొని నా కళ్ళలోకి చూస్తున్నాడు. వయసులో, ఉదయం బంధువుల యింట్లోని అబ్బాయిలా ఉన్నాడు. ఆకలితో పోరాడి పోరాడి ఇతని పసితనం వాడిన గుర్తులు స్పష్టంగా కనిపించసాగాయి. డాలర్ రెపరెపల ముఖం ముసలితల్లిని ఈసడించుకోసాగింది.

"ఈ బిచ్చగత్తె చివరికి శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లోని 'భిక్షువర్షీయసి'లా అయిపోదుగదా" సాహిత్యానుభవం వేసిన అప్లైడ్ ప్రశ్న.

"యిన్ని ఫ్లైవోవర్లు, నున్నటి తారురోడ్లు, కంప్యూటర్ కఫేలు, పబ్బులు, విదేశీ పెట్టుబడులు... యింకా పేదరికమా" నమ్మలేని అంతరంగాన్ని గిలకొట్టిన ప్రశ్న.

ఎవరో తినగా మిగిలిన 'పాప్‌కార్న్' ఆ ముసలి తల్లికి ఇచ్చినట్లుంది. ఆబగా తాను తింటూ, పిలగానికి తినిపించసాగింది. ఆమె పట్టుకున్న ఆహార (?) పొట్లంపై కాప్షన్ ఐటెమ్ ప్రస్ఫుటంగా కనిపించసాగింది నాకు.

"అప్పులకు తాళలేక రైతు ఆత్మహత్య" అంతరంగం నావైపు ప్రశ్నార్థకంగా చూడసాగింది. అంతరంగాన్ని బలవంతాన తొక్కిపడ్తూ, ఆ తల్లి కళ్ళలోకి సరిగా చూడలేక, ఆ అబ్బాయి కళ్ళల్లో ఆశల్ని అంచనా కట్టలేక... భారంగా యూనివర్సిటీకి బయల్దేరాను, శీన్ను కలవడానికి.

శీను పి.హెచ్.డి. పూర్తిచేసే దశలో ఉన్నాడు. శీను రూంలో ఉండే నేను సివిల్స్‌కి ప్రిపేర్ అయ్యాను. నగరానికి దూరంగా ఉన్న ఆ యూనివర్సిటీతో ఏదో ఆత్మీయ బంధాన్ని పెంచుకున్నాను. అది ఓ చిన్న ప్రపంచం.

నేను యూనివర్సిటీ హాస్టల్‌కు వెళ్ళేసరికి ఏదో చర్చ జరుగసాగింది. వారి మాటల్ని వింటుంటే వారు యమ్.టెక్. చేస్తున్న స్టూడెంట్లుగా అర్థమైంది. చదువు కాగానే ఏ ఫారిన్ యూనివర్సిటీకి వెళ్ళాలి, ఎక్కడ ఎంత జీతం యిస్తారు, కెరియర్ ప్రాస్పెక్ట్సు ఏంటని చర్చించుకుంటున్నారు.

రూంకు వెళ్ళిన నన్ను, శీను ఆదరంగా రిసీవ్ చేసుకున్నాడు. కొంతసేపటి తర్వాత శీను,

"సీనియర్లందరూ యు.యస్.కి వెళ్ళారు. నెక్స్ట్ యియర్ నేం గూడా వెళ్ళటానికి ప్రయత్నిస్తున్నాను. ఇండియాలో ఉంటే ఏముంది చెప్పు? లెక్చరర్ ఉద్యోగాలు పడక ఎన్ని సంవత్సరాలైందే? ప్రైవేటుగా పనిచేస్తే వచ్చే రెండు మూడువేల రూపాయల్తో పెళ్ళాం బిడ్డల్ని ఎలా పోషించేది? యిప్పటికే ముప్పై ఏండ్లు గడిచిపోయే! యింక ఎపుడు పెళ్ళి జేసుకుండేది, ఎన్నడు సంసారం జేసేది. అన్నట్లు రెడ్డి ఉరేసుకొని చనిపోయిండు" అన్నాడు.

పిడుగులా ధ్వనించిన ఆ చివరి వాక్యాలకు కలవరపడి,

"అదెట్లా?! రెడ్డి బాగానే ఉండేకదా" అడిగాను ఆతృతగా.

"కారణమేంటో తెలియదు. స్టూడెంట్సందరూ అనుకునేదేమిటంటే యిప్పటికే అతనికి ముప్పైఅయిదేళ్ళు దాటినై. పి.జి.ల మీద పి.జీ.లు చేసే! పి.హెచ్.డి. కూడా అయిపోవచ్చె. ఉద్యోగాలు దొరికేట్లు లేవాయే. అందునా హ్యూమానిటీసాయే. అందుకే ఉరేసుకుండట" అన్నాడు సీలింగ్ వైపు చూస్తూ. తిరిగి తన మాటల్ని కంటిన్యూ చేస్తూ,

"కారణమేంటో తెలియదు. స్టూడెంట్సందరూ అనుకునేదేమిటంటే యిప్పటికే అతనికి ముప్పైఅయిదేళ్ళు దాటినై. పి.జి.ల మీద పి.జీ.లు చేసే! పి.హెచ్.డి. కూడా అయిపోవచ్చె. ఉద్యోగాలు దొరికేట్లు లేవాయే. అందునా హ్యూమానిటీసాయే. అందుకే ఉరేసుకుండట" అన్నాడు సీలింగ్‌వైపు చూస్తూ.

"యు.జి.సి. వాళ్ళు ఈమధ్య పి.హెచ్.డి. స్కాలర్లకు సరిగా ఫెలోషిప్పులు ఈయటంలేదు. బాగా లిమిట్ చేసారు. యూనివర్సిటీలకు క్రమేణా గ్రాంటులు బంద్ జేయించి, యూనివర్సిటీలు తమంతట తామే నిధులు సమకూర్చుకోవాలంటూ యు.జి.సి. ఒత్తిడి చేస్తుందని విద్యార్థి నాయకులు అంటున్నారు. అదే నిజమైతే రిసెర్చి స్కాలర్ల పరిస్థితి..." శీను ఆగాడు.

ఇంతలో పక్కరూంలోంచి ఇద్దరు విద్యార్థులు వాదులాడుకుంటూ శీను రూంకు వచ్చారు. వాళ్ళు ఆరోజు సివిల్స్ 'ఎస్సే' పేపరు రాసారట. ఆ ఇద్దరూ కూడా 'గ్లోబలైజేషన్-వెథర్ బూన్ ఆర్ బేన్' (Globalisation - Whether boon or bane) అంశంపైన రాసారట. ఒకరు టాపిక్కు అనుకూలంగా, మరొకరు ప్రతికూలంగా రాసారట. ఎవరికి వారే తాము రాసింది కరెక్టంటూ ఆర్గ్యూ చేసుకుంటున్నారు. నా అభిప్రాయం చెప్పమని నన్నడిగారు. మొదట, పాజిటివ్‌గా రాసిన వ్యక్తిని సంక్షిప్తంగా ఏం రాసావో చెప్పమన్నాను: దానికి అతను,

"బ్రదర్! గ్లోబలైజేషన్ వల్ల భారతదేశ ద్వారాలు ప్రపంచానికి తెరువబడతాయి. తత్ఫలితంగా భారతదేశంలోకి విపరీతంగా విదేశీ పెట్టుబడులు వస్తాయి. పోటీతత్వం పెరుగుతుంది. స్వదేశీ పరిశ్రమ విదేశీ పరిశ్రమతో పోటీ పడుతుంది. నాణ్యతా ప్రమాణాలు పెరుగుతాయి. ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ తదితర కన్స్యూమర్ ప్రొడక్ట్సు ధరలు బాగా తగ్గుతాయి. అంద

రికి అందుబాటులో అన్నీ ఉంటాయి. ప్రజల కొనుగోలు సామర్థ్యం పెరుగుతుంది..." చెబుతున్న అతని దృష్టి 'కిన్‌లీ' మినరల్ వాటర్ బాటిలుపై పడింది.

"బ్రదర్ కాస్త ఆ బాటిల్ అందుకుంటావా" నన్నడిగాడు.

నేనిచ్చిన బాటిలు అందుకుని, నోట్లో పోసుకుని,

"చూసారా! కోకాకోలా బ్రాండు కిన్‌లీ రూపంలోకి వచ్చింది. పెప్సీ బ్రాండు 'అక్వాఫీనా' మినరల్ వాటర్‌గా మనముందుకొచ్చింది. సరళీకరణే లేకపోతే యిది సాధ్యమేనా?" కళ్ళెగరేసాడు అతను. తిరిగి కంటిన్యూ చేస్తూ,

"గ్లోబలీకరణ వలన రేప్పొద్దున సామాన్యుడు కూడా కంప్యూటర్ కొనుక్కోగలడు. మన రాష్ట్ర రాజధానిలో యిన్ని ఫ్లైవోవర్లు, తార్రోడ్లు; అంతెందుకు! బిల్‌గేట్సు నగరాన్ని దర్శించాలనుకోడమే నిదర్శనం. గ్లోబలీకరణ పుణ్యమాని యిప్పుడు మన నగరంలో పీటరు ఇంగ్లాండు, వ్యాన్‌హూస్సేన్, యారోలాంటి బ్రాండెడు షర్టులు; లీ, రాంగ్లర్, ఆక్సెమ్‌బర్గ్‌లాంటి జీన్సు, పాంటులు దొరుకుతున్నాయి. ఇంకా- ఇండియన్ ఎయిర్‌లైన్సు ప్రైవేటు ఆపరేటర్లతో పోటీపడి విమాన చార్జీలు తగ్గించిందంటే ఏంటీ కారణం? బి.యస్.యన్.యల్. కార్పోరేటైజ్ అయి ప్రైవేటు సర్వీసు ప్రొవైడర్లతో పోటీపడ్తుందంటే రీజన్ ఏంటీ? యిప్పుడు ప్రపంచం మన గుప్పిట్లో- ఒక్క మౌజ్ క్లిక్‌తో డెస్కుటాపుపై లోడవ్వుద్ది..."



"అన్నా! ఈ గ్లోబలీకరణ, సరళీకరణ అంతా నాటకమేనే. యిదంతా ఒరకంగా పరాయీకరణేనే. ధనిక దేశపోళ్ళు మునపటి లెక్క బడుగుదేశాల్ని దండయాత్రలు చేసి దోసుకోలేక ఈ ట్రేడువారు సేత్తండ్రే. మనను నాజూగ్గా ఆ రొంపిలోనికి దింపి, నంజుకు దినేత్తందుకేనే ఈ గ్లోబలీకరణ అనే పులికడియం..."

"మీరెప్పుడైనా చూసారా' అన్న అర్థం వచ్చేలా మావైపు చూసాడు. అతని కళ్ళల్లో నాకు ఇంటర్నెట్‌లోని డార్కు వెబ్‌సైట్లు కనిపిస్తున్నాయి.

"అతను గ్లోబల్ వెబ్‌లో ఉన్నాడు" ఇన్‌సైడర్ నా కళ్ళలోకి వచ్చాడు.

"యిదంతా ఎలా సాధ్యమైంది? నష్టాల్లో ఉన్న ఎన్ని పబ్లిక్ సెక్టార్లను ప్రభుత్వం మూసివేయలేదు! ఎంత డబ్బును ఆదా చేయలేదు! ఎంతకాలమిలా సబ్సిడీలతో జీవితాల్ని ముడిపెట్టడం? యూజర్ చార్జీలు వసూలు చేయాలి. అప్పుడే మనం మొదటి ప్రపంచ దేశాల్లో సరితూగగలం. మనది వర్షాధార ప్రాంతం. ఎంతో భూమిని వేస్టు చేస్తున్నాం. అదంతా ఏ మల్టీనేషనల్ కంపెనీకో లీజుకిస్తే వాళ్ళు యిందులో 'కార్న్' పండించేవారుకదా? చక్కగా పందుల పెంపకాన్ని పరిశ్రమల స్థాయిలో చేయవచ్చు. 'మీట్' ఎక్స్‌పోర్టు చేయవచ్చు. అరే! అడ్వాన్సుడుగా ఆలోచించాలి బై. మనం అమెరికాతో సహా ముందుకెళ్ళాలి (భుజాలెగరేస్తూ)."

అతని కళ్ళల్లో నాకు టాంకుబండిపై కనిపించిన 'డాలరు రెపరెపల' వ్యక్తి కనిపించాడు. అతని ప్రసంగం చాలన్నట్లు తలూపి, రెండో వ్యక్తిని చెప్పమన్నాను.

అతను మొదలుపెట్టాడు.

"అన్నా! ఈ గ్లోబలీకరణ, సరళీకరణ అంతా నాటకమేనే. యిదంతా ఒరకంగా పరాయీకరణేనే. ధనిక దేశపోళ్ళు మునపటి లెక్క బడుగు దేశాల్ని దండయాత్రలు చేసి దోసుకోలేక ఈ ట్రేడువారు సేత్తండ్రే. మనను నాజూగ్గా ఆ రొంపిలోనికి దింపి, నంజుకు దినేత్తందుకేనే ఈ గ్లోబలీకరణ అనే పులికడియం..."

వింటున్న మొదటి వ్యక్తి ముఖంలో అవహేళన, కేర్‌లెస్‌నెస్.

"నోబల్ బహుమతిగ్రహీత అమర్త్యసేన్ చెప్పిన 'సేఫ్టీనెట్సు' యాడున్నవే? ఊళ్ళల్ల, ఈ రోజుకైనా దొడ్డికి బోదామంటే సెంబట్టుకొని దూరంగా సెర్లకో, సెట్టు సాటుకో పోవాల్సిందేనాయే. మగోళ్ళు వత్తుండ్రంటే ఆడోళ్ళు లేసి నిలబడాల్సిందేనాయే! రోగమొచ్చినా, నొప్పొచ్చినా ఏదో కాయగసరు నమిలి మిగాల్సిందేకదా! ఎంతమంది తల్లులు, వాళ్ళ బిడ్డలు సచ్చిపోలే. గంతెందుకు. ఈ రోజులల్ల మనం ఆకలిసావుల సూడట్లేదా? యింటలేదా? పేపర్లల్ల సదవటంలేదా? పత్తి రైతులు సచ్చిండ్రని పేపర్లల్ల వార్తలు రాని రోజుందా?"

వింటున్న మొదటి వ్యక్తి 'అప్‌సెట్' అయినట్లు స్పష్టంగా కనిపించసాగింది. అతని కళ్ళల్లో మునుపటి 'షార్పునెస్' కనిపించడంలేదు. అంత వరకు గోడకు అంటించిన 'పారిస్ బ్రిడ్జిని' చూస్తున్న అతని కళ్ళు నేల బారాయి.

"కూటికోసం పొట్ట సేతబట్టుకొని జనం వలసలు పోబట్టిరి. సెర్లెండిపాయే, బావులెండిపాయే... మొత్తంగా బతుకులే ఎండిపోబట్టే! జనం పిడికెడు బువ్వకోసం తండ్లాడబట్టిరి. ఈ అరిగోస సెప్తె తీరేదా?"

కళ్ళు తుడుచుకున్నాడు అతను. కాసేపు సీలింగు వైపు చూసి,

"గీ కంప్యూటర్లు, ఫ్లైవోవర్లు, తార్రోడ్లు, బిల్‌గేట్లు బువ్వపెడ్తాయే?! ఫోన్ల బిల్లులు తగ్గుతేంది, కంప్యూటర్ల ధరలు తగ్గుతేంది! జర ఊళ్ళల్లకెళ్ళి కరెంటు బిల్లు ఎంతొత్తందో సూడు. మొన్నమొన్నటివరకు డీజల్ ధరలు ప్రభుత్వం నియంత్రించే. ఇప్పుడేమో అంతర్జాతీయ మార్కెటు నిర్ణయించబట్టే. రైల్వేలు చార్జీలు పెంచబట్టే. మన రాష్ట్రంల ప్రభుత్వం డీజల్ ధరలు పెరిగినయని ఎన్నిసార్ల బస్సు చార్జీలు పెంచలేదు? ఉప్పు, పప్పు, మిరపకాయతో కలిపి ముప్పైఆరు దినుసుల ధరలు ఆకాశాన్నంటుతున్నై. ఏది చూసినా కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి. ఈ ఉదారీకరణ వల్ల ఎన్ని ఉద్యోగాలకు ఎసరొచ్చిందనుకున్నరు?"

మొదటివ్యక్తి బెడ్‌పై కూలబడ్డాడు. చెబుతున్న వ్యక్తి వైపు అన్యమనస్కంగా చూడసాగాడు.

"యిప్పుడు పదోతరగతి సదువుడే మహాగగ్గలం. చైనా దేశాన్ని సూడు. గాళ్ళు ముందుగాల జనానికి మౌలిక వసతులు కల్పించిండ్రు. అయితంక, నెమ్మది నెమ్మదిగా మార్కెటు శక్తులకు గేట్లు తెరిసిండ్రు. మనోళ్ళు ఉర్కుర్కి పశువుల గాయబట్టిరి. యిప్పుడేమైంది? ముందున్నది మొసళ్ళ పండగ. తెచ్చినప్పు తీర్చమని ప్రపంచ బ్యాంకు గొంతుమీద గూకుంటది. ఈ యేడసువంటి కరువు ఓ రెండుమూడేండ్లు కంటిన్యూ అయితే ఈ దేశం పరిస్థితి ఏంగావాల? మనం జేసే పని తరీఖా గిట్లుండొద్దు."

మొదటి వ్యక్తి చప్పున,

"యింకెట్లుండాలి" ప్రశ్నించాడు, ముఖాన్ని చిట్లిస్తూ.

రెండో వ్యక్తి కాస్త నవ్వి,

"మొదగాల ఊళ్ళను బాగుజెయ్యాల. సెర్లల్ల పూడిక దీయించాల. బావుల తవ్వించాల. సిన్న సిన్న ఆనకట్టలు కట్టించాల. బీడు భూములన్నీ సాగులోనికి తీస్కరావాల. యే ఊరి జనం ఆ ఊళ్ళనే బత్కేట్లు సెయ్యాల. జనం దగ్గర భూమేలేదాయే! కంప్యూటర్ల భూముల లెక్కలు ఎక్కించి ఏంజేత్తరు? రెవెన్యోళ్ళు, కరంటోళ్ళు, ఆస్పత్రులల్ల- ఎక్కడ జూసినా అవినీతే. దేశం బాగుపడాలంటే లంచగొండుల పనిబట్టాల. లంచం ఇవ్వొద్దు. తీస్కోవద్దు. గీయన్నీ సేసినంకనే గ్లోబలీకరణైనా, సరళీకరణైనా. మన కడ్పుల సల్లంగుంటేనేకదా శాంతి. ఆరోజు దగ్గరపట్ల కన్పిస్తలే! మనకు కావల్సింది యింతపని, బుక్కెడు బువ్వ." తన ప్రసంగం ముగించినట్లు చేత్తో తల తుడుచుకున్నాడు చెబుతున్న రెండోవ్యక్తి.

ఆ వ్యక్తి కళ్ళల్లో నాకు టాంకుబండ్‌పై కనిపించిన బిచ్చగత్తె మనవడు కనిపించసాగాడు. నా కళ్ళల్లో తడి. నాలోని ఇన్‌సైడర్ సైలెంటయాడు.

ఎవరో శీన్ను అడుగుతున్నారు 'డిస్కోకు వస్తావా' అని. ప్లైరూంలోంచి మైకేల్ జాక్సన్ 'ఎర్త్' పాట వినిపించసాగింది. వరండాలోకి వచ్చాను. ఆకాశంలో మిణుకుమిణుకుమంటున్న నక్షత్రాలు. యింతలో ఓ విమానం శబ్దం చేస్తూ హోస్టలు పైనుంచి వెళ్ళసాగింది.

ఎంతమంది తమ తలల్ని ఎత్తి పడమరవైపు వెళ్తున్న ఆ విమానాన్ని చూస్తున్నారో!

ఎంతమంది ఈ నేలని, గాలిని, ఆ బిచ్చగత్తె కళ్ళల్లోని దైన్యాన్ని, ఆమె మనవడి కళ్ళల్లోని ఆశల్ని, మొత్తంగా నా తల్లి రూపాల్ని కూలదోసుకొని పడమరకి ఎగిరిపోక పోతామని ఎదురుచూస్తున్నారో!

బాధ కన్నీరుగా ఒలికింది- గ్లోబల్ నగరంపై. ●